అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- స్థానికులతో మాటామంతి
- మున్ముందు మరింత అభివృద్ధికి హామీ
- నియోజకవర్గ పర్యటనల్లో బిజీబిజీగా ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే జారే ఆధ్వర్యంలో..

అశ్వారావుపేట/దమ్మపేట/ములకలపల్లి: అశ్వారావుపేటలో రూ.1.54 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.48.41కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇందులో పంచాయతీరాజ్ విభాగంలో రూ.37.32కోట్లు, ఉపాధి హామీకి రూ.11.08కోట్లు, నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతుల పంట పొలాలకు గ్రావెల్ రహదారులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి, మొద్దులగూడెం, దమ్మపేట, మందలపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరైన సీసీ, గ్రావెల్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మందలపల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 11 నెలల కాలంలో తాను చేసిన అభివృద్ధి, భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టనున్న కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు. మరోవైపు, ఉపాధి హామీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములకలపల్లి మండలకేంద్రంతోపాటు, రామచంద్రాపురం జీపీ కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జారే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి జీపీ కార్యాలయంలో మాట్లాడారు. అనంతరం స్థానిక జూనియర్ కాలేజీలో ల్యాబ్‌ను ప్రారంభించారు. చంద్రుగొండ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రాంగణంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే జారే మంగళవారం శంకుస్థాపన చేశారు.

అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ.7 లక్షల నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. పొదుపు సంఘాల మహిళలకు మంజూరైన రూ.1.5 కోట్ల రుణమొత్తాల చెక్కును పంపిణీ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే రూ.4.81 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాజాపురంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయితీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా మండలాల్లోని ఆయా కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ములకలపల్లి జూనియర్ కాలేజీలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ఎమ్మెల్యే పాయం ఆధ్వర్యంలో..

బూర్గంపాడు/మణుగూరుటౌన్/పినపాక/కరకగూడెం/అశ్వాపురం: ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మంగళవారం బూర్గంపాడు మండలంలోని లక్ష్మీపురం, సోంపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. సోంపల్లిలోని రైతుల కోసం రూ.6.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. లక్ష్మీపురం గ్రామంలో పాశం జయరావిఎరెడ్డి అనే రైతుకు ఈజీఎస్‌లో మంజూరైన పశువుల షెడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీపురం, సోంపల్లి గ్రామాలలో ఉపాధిహామీ పథకంలో 100రోజుల పనిదినాలను పూర్తిచేసుకున్న కూలీలను ఆయన సన్మానించారు. మణుగూరు మండలంలోని కూనవరం పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం శంకుస్థాపన చేశారు. బాంబేకాలనీలోని భవానీ ఆలయం సమీపంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జాతీయ ఉపాధి హామీ పథకం కింద 100 రోజులకు 100 రోజులు గైర్హాజరు లేకుండా పూర్తి చేసుకున్న ఎలిబోయిన వెంకటమ్మను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. పినపాక మండలంలో 100 రోజుల ప్రజాపాలన పూర్తయిన సందర్భంగా పినపాక ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు మంగళవారం మండలంలో పర్యటించారు. విజయోత్సవంలో భాగంగా ఉపాధి హామీ కూలీలను సత్కరించారు. అనంతరం ఈ బయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో సౌకర్యాలపై విద్యార్థులను ఆరా తీశారు. కరకగూడెం మండలంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగ మంగళవారం మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేసారు. అనంతరం రేగళ్ల పంచాయతీ మాదన్నగూడెం గ్రామంలో రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గ్రామస్తుల సమక్షంలో ప్రారంభించారు. ఈ గ్రామ సమస్యలు ఇప్పటికే 'సాక్షి'లో ప్రచురితమయ్యాయి. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలేబోయిన వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అశ్వాపురంలో ఉపాధి హామీ పథకం పనుల జాతర కార్యక్రమంలో మంగళవారం మండల పరిధిలోని నెల్లిపాక గ్రామ పంచాయతీ టేకులగుట్ట గ్రామంలో రహదారి పనులకు ఎమ్మెల్యే పాయం శంకుస్థాపన చేశారు. నెల్లిపాక గ్రామంలో మండ్రు నాగసుధీర్ నాలుగు ఎకరాలలో మునగసాగు చేయగా మునగ తోటను ఎమ్మెల్యే పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధికారులు మునగసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


పినపాక: కూలీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యే తెల్లం ఆధ్వర్యంలో..

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం/చర్ల: పట్టణంలోని పలు కాలనీలలో నిర్మించే సీసీ రోడ్ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. రామాలయం చుట్టూ మాడ వీధుల నిర్మాణం కోసం ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, భూసేకరణ పూర్తికాగానే పనులను చేపట్టి సుందర భద్రాద్రిగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.. పట్టణంలోని శివారుల కాలనీలకు సైతం సీసీ రోడ్డు నిర్మించే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని నిధులు విడుదల కాగానే పనులను ప్రారంభిస్తామని తెలిపారు. దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం నుంచి గంగోలు వరకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీనగరం ఆర్అండ్‌బీ రోడ్ నుంచి గంగోలు ఆర్అండ్‌బీ రోడ్‌వరకు వయా మండల పరిషత్ మీదుగా సుమారు రూ.2కోట్ల 80లక్షల అంచనా వ్యయంతో కూడిన బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులను ప్రారంభించారు. రహదారికి చొరవ తీసుకోడంతో అచ్చితాపురం గ్రామస్తులు, నాయకులు శాలువా కప్పి ఎమ్మెల్యేను సన్మానించారు. చర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకట్రావు శంకుస్థాపనలు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీకాలనీలో డబుల్ బెడ్ రూం సముదాయంలో రూ.13.90 లక్షల అంచనా వ్యవయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.3.50 లక్షలతో ఫ్లాట్‌ఫాం ఏర్పాటుకు సంబంధించి భూమిపూజ చేశారు. అంతకు ముందు గుంపెన్నగూడెంలోని ముత్యాలమ్మ అమ్మవారి అలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ ఈదయ్య, ఇంజనీరింగ్ అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.


భద్రాచలంటౌన్: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

క్లుప్తంగా

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

అశ్వారావుపేటరూరల్: విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను అంచనా వేసేందుకు వచ్చే డిసెంబర్ 4వ తేదీన నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్)ను పకడ్బందీగా చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి అమృతలూరి నాగరాజశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక బీఈడీ కళాశాలలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు పరీక్ష నిర్వహణ, ఓఎంఆర్ పూర్తి చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు.జిల్లాలోని అన్ని బీఈడీ కళాశాలల్లో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రసాద్‌రావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

29న వక్తృత్వ పోటీలు

చర్ల: చర్లలోని మీ కోసం మేమున్నాం సహాయక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 29న విద్యార్థులకు సామాజిక సేవలు–మానవత్వ విలువలు–మన భాగస్వామ్యం అనే అంశంపై చర్ల మండల స్థాయిలో వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు మీ కోసం మేమున్నాం సహాయక సమితి అధ్యక్షుడు నీలి ప్రకాశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 29న ఉదయం 10 గంటలకు చర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న ఈ వక్తృత్వ పోటీలకు ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, తెలుగు మాధ్యమంలోనే ఈ పోటీ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.వెయ్యి నగదుతో పాటు మెమొంటోలను అందజేయడం జరుగుతందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 96181 70754, 94905 18587 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం సన్న రకాలకు రూ.500లు బోనస్ ఇస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. తిప్పనపల్లి, రావికంపాడు, పోకలగూడెం గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ లంకా నర్సింహారావు, డైరెక్టర్లు రామిశెట్టి సరళ, నాగరాజు, రాజబోయిన నాగేశ్వరరావు, రైతులు గాదె లింగయ్య, అంచె శ్రీను, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ గిరిజన పాఠశాలలలో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న 85 మంది ఏఎన్ఎం సిబ్బందికి గత తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌తో పాటు ఐటీడీఏ డీడీ మణెమ్మలకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనతు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏఎన్ఎంల సమస్యల పరిష్కారం కోసం ఓ కమిటీని సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు 10 మందితో ఏర్పడ్డ ఈ కమిటీ సభ్యులుగా పద్మ, కౌసల్య, సరిత, లక్ష్మి, సుధారాణి, కుమారి, స్వరూప, టి.శ్రావణి, నాగమణి, బి.శ్రావణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చర్యలు తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని సున్నంబట్టి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌లపై తక్షణమే ఐటీడీఏ ఉన్నతాధికారులు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ హాస్టల్‌లో కనీసం మెనూ పాటించడం లేదని, విద్యార్థులు ప్రశ్నిస్తే ఇంటికి వెళ్లిపోండి అంటూ హెచ్ఎం, వార్డెన్ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. హాస్టల్‌కు జీసీసీ ద్వారా అందిస్తున్న పప్పు, బియ్యం, నిత్యావసరాలను మాయం చేస్తున్నారని, తక్షణమే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుజ, సహాయ కార్యదర్శి వంశీ, కమల్ రాజు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

బూర్గంపాడు: పరుశురాం పరివార్ ఆధ్వర్యంలో మంగళవారం సారపాకలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పరుశురాం పరివార్ రాష్ట్ర అధ్యక్షులు ముత్తవరపు రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి సాయి కిరణ్‌శర్మ, కల్యాణ్, విజయ్, యోగానందరెడ్డి,హనుమంతు, రవికిరణ్, గోవర్ధన్, ప్రమీల, భవానీ, ఇందు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమావేశం


మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

చంద్రుగొండ: పంచాయతీ ఓటర్ల జాబితాపై రాజకీయ నాయకులతో కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ బయ్యారపు అశోక్ సమావేశమైయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఎంపీఓ ఖాన్, వివిధ పార్టీల నాయకులు దార బాబు, వారాధి సత్యనారాయణ, దారం గోవిందరెడ్డి, మరకాల రవీందర్‌రెడ్డి, మెడా మోహన్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ పాల్గొన్నారు.

ములకలపల్లి: ములకలపల్లి మండలవ్యాప్తంగా 27,998 మంది ఓటర్లు ఉన్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహాలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఇటీవల నూతనంగా 166 మందికి తమ ఓటు నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. తుది ఓటరు జాబితాపై అభ్యంతాలుంటే తెలియపరచాలని రాజకీయపక్ష నాయకులకు సూచించారు. మండలప్రత్యేకారి రమేశ్, ఎంపీఓ లక్ష్మయ్య, పలుపార్టీల నాయకులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 30న ఓటరు జాబితాను నోటీస్ బోర్డ్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. సమావేశంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పీఎఫ్ కమిషనర్‌కు వినతి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మూడు సంవత్సరాల సీఎంపీఎఫ్ జమ వివరాల పాస్ పుస్తకాలు అందజేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా త్రైపాక్షిక సమావేశానికి వచ్చిన కొత్తగూడెం రీజియన్‌స్థాయి పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.కనకమ్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నాసర్‌పాషా మాట్లాడుతూ.. కొత్తగూడెం రీజియన్ స్థాయిలోని మణుగూరు, ఇల్లందు, కొత్తగూడెం ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్ పుస్తకాలు అందించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా పీఎఫ్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చనిపోయిన, అనారోగ్యంతో పని మానివేసిన కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్ వాపస్ త్వరగా ఇవ్వాలని, కొత్త కార్మికులకు పీఎఫ్ నంబర్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు గుమ్మడి అమృతరావు, బండి జగదీష్, ఖాదర్, లక్ష్మి, నరసమ్మ, స్వరూప, అనంత, రాధ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలను నిరసిస్తూ ధర్నా


చర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

చర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరశిస్తూ తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం, సీపీఎం ప్రజాసంఘాల అధ్వర్యంలో మంగళవారం చర్లలో ధర్నా నిర్వహించారు. చర్లలోని ముందుగా స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన రహదారిపై బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణా గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం నరేష్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులతో కాపాడుకున్న 29 కార్మిక చట్టాలను విభజిస్తూ కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పామూరు బాలాజీ, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు పొడుపుగంటి సమ్మక్క, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షారోన్, తెలంగాణా గిరిజన సంఘం నాయకులు చిట్టిబాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్ పాఠశాలతో పాటు ఎస్సీ బాలుర హాస్టల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌లు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర హాస్టల్‌లో సరిగా ఉడకని ఆహార పదార్థాలు వండి వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించి నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం విధిగా అందించాలని సూచించారు.

సామూహిక సాయి వ్రతాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీసాయిబాబా మందిరంతో పాటు రాజరాజేశ్వరి ఆలయంలో కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా మంగళవారం సత్యసాయి వ్రతాలు వైభంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాలను నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షుడు కొమ్మనాపల్లి ఆదినారాయణ పాల్గొన్నారు.

వీఓఏల కమిటీ ఎన్నిక

కారేపల్లి: ఇందిరాక్రాంతి పథం(ఐకేపీ) మండల వీఓఏల మండల నూతన కమిటీని జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కారేపల్లిలో మంగళవారం ఎన్నుకున్నారు. వీఓఏల మండల అధ్యక్షురాలిగా ధరావత్ బుజ్జి, కార్యదర్శిగా ధరావత్ సంగీత, కోశాధికారిగా అజ్మీర లక్ష్మి, ఉపాధ్యక్షుడిగా భూక్యా రాంబాబు, సహాయ కార్యదర్శిగా కె.వీరన్నలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, శ్రీను, లలిత పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, పెనాల్టీ విధానాన్ని రద్దు చేయాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి పి.సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్ర కమిటి ఇచ్చిన దశలవారీ ఆందోళన భాగంగా వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల అడ్డాలలో కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.ప్రసాద్, సతీష్, జానయ్య, రాజ్‌కుమార్, దేవి, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో గల మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర పాఠశాల వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ.. పరిశుభ్రతపై విద్యార్థులు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జానకి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, విజయ, భవాని తదితరులు పాల్గొన్నారు.

డీఈ కార్యాలయం ఏర్పాటు చేయాలి


డీఈ కార్యాలయం ఏర్పాటు కోసం నిరసన చేపట్టిన నాయకులు, రైతులు

దమ్మపేట: నియోజకవర్గ కేంద్రం, అశ్వారావుపేటలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు విన్నపం చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని గండుగులపల్లిలో నాయకులు, రైతులు ఫ్లెక్సీతో కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో మాట్లాడుతూ... అధికంగా ఏజెన్సీ ప్రాంతాలు ఉన్న నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా, కోతలు లేని విద్యుత్, విద్యుత్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండటం తదితర అంశాల కారణంగా డీఈ కార్యాలయం ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉందని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి, కార్యాలయ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షాకీర్, కాసగాని ప్రసాద్, శాంతిబాబు, మడకం రాజేష్, మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

కళాజాతా బృందం ప్రచారం

అశ్వాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాతా ఆధ్వర్యంలో కాంపల్లి బాలు బృందం మంగళవారం మండలంలో ప్రచారం చేపట్టారు. మొండికుంట, నెల్లిపాక, సీతరాంపురం, గొల్లగూడెం, అశ్వాపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. నెల్లిపాకలో పర్యటనలో ఉన్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిశారు. కాంపల్లి బాలు, ఆలవాల కృపానందం, గోవింద గురువయ్య, షేక్ ముసా, మిట్టపల్లి నరేందర్, స్నేహ, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు 'ధర్మసమాజ్' వినతి

దుమ్ముగూడెం: బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ మండల కన్వీనర్ జిలకర చంటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90శాతంకు పైగా పేద, మధ్యతరగతి వర్గాల వారు ఉన్నారన్నారు. వీరు ప్రధానంగా ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సమస్యలను పరిష్కరిస్తే తెలంగాణ ప్రజలు సుఖ, సంతోషాలతో ఉంటారన్నారు.

రాజ్యాంగం దేశానికి దిక్సూచి

మణుగూరుటౌన్: బీఆర్ అంబేద్కర్ లిఖించిన రాజ్యాంగం దేశానికే దిక్సూచి అని తహసీల్దార్ రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని విగ్రహానికి ఎంపీడీఓ, ఎంపీఓలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరోవైపు సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్ ఆధ్వర్యంలో దేశ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేటలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం దమ్మపేటలో బీజేపీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయులను స్మరించారు. సామాన్యుడు కూడా రాజ్యాంగం వలనే అందరితో సమానమైన హక్కులు పొందగలుగుతున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోలికపోగు ముసలయ్య, దుర్గా శ్రీనివాస్, ప్రశాంత్, సతీష్, నాగరాజు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రాజ్యాంగ సభ

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులతో రాజ్యాంగసభ నిర్వహించారు. 1946 నుంచి 1950 వరకు జరిగిన రాజ్యాంగసభ సమావేశాల్లోని ముఖ్య సన్నివేశాలను విద్యార్థులు అప్పటి నాయకుల వేశధారణలో నమూనా సభ నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్‌పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి పండిట్, సరోజినినాయుడు, కేయం మున్షీలుగా విద్యార్థులు నటించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు జి.సుశీల, ఎం.పద్మా పర్యవేక్షించారు.


అన్నపురెడ్డిపల్లి: నమూనా రాజ్యాంగ సభలో అంబేద్కర్ వేశధారణలో మాట్లాడుతున్న విద్యార్థి

వ్యాసరచన పోటీలు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌యం ఏజే ప్రభాకర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ గురించి విద్యార్థులకు తెలియచేశారు. వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.